తెల్లబట్ట

ప్రియమైన రమేశ్‌గారికి,

ఆ రోజు రాత్రి పొద్దుపోయే దాకా ఎన్నో విషయాలు చర్చించుకున్నాం. మీరు వెళ్ళిపోయాక నాలో అంతర్మథనం సాగింది. కొత్త ఆలోచనలు సాగాయి. జీవితం ఎంత విచిత్రమైనది. మనం ఒకటి తలిస్తే అది ఒకటి తలుస్తుంది. నా పట్లే కాదు మీ పట్ల కూడా జీవితం యిలాగే కావడం సామాజిక పరిస్థితులు ఎంత బలీయమైనవో చెప్పకయే స్పష్టం చేస్తున్నాయి. ఏమైనా మీరు తిరిగి కొత్త జీవితం గెలుచుకోవాలని నిశ్చయించుకోవడాన్ని అభినందిస్తున్నాను. పిల్లలు పెరిగిన ఈ వయసులో పెళ్ళా అని ఎవరైనా అంటారేమోనని సంకోచించకుండా మీ మనసులోని మాట చెప్పినందుకు అభినందనలు. ఈ వయసులో మీ జీవితంలో ప్రవేశించే స్త్రీ కేవలం మీ తోడుగా కాకుండా మీ కుటుంబ బంధుమిత్రులందరిలో పాలలో నీళ్ళలా కల్సిపోగలగాలి. మీతో పాటు ఆ స్త్రీకి కూడా మీ పెళ్ళి కొత్త జీవితం యివ్వాలి. మీలాంటి సంస్కారవంతులకు, ముఖ్యంగా మగవాళ్ళకు భార్య దొరకడం అంత కష్టం ఏమీ కాదు. కాని భర్తను కోల్పోయిన స్త్రీలకు మీకులాగా తిరిగి కొత్త భర్త దొరకడం అంత సులభం కాదు. అలాంటి స్త్రీకే మీ జీవితంలో స్థానం యివ్వాలని నిర్ణయించుకోవడం మీ జీవితావగాహనను తెలుపుతుంది.

.....మీరు ఒక నిర్ణయానికి వచ్చే ముందు వాళ్ళ జీవితక్రమాలు తెలపడం నా బాధ్యత. అందుకని మీరడిగిన వివరాల్తో పాటువాళ్ళ మొత్తం జీవితం మీ ముందు పరుస్తున్నాను. సావకాశంగా ఆలోచించి అన్ని విధాల మానసికంగా సిద్దపడి మీ నిర్ణయం తీసుకోవడానికి యిది అవసరం అన్పించింది. మీ నిర్ణయం కోసం వేచి ఉంటాను.

— మీ విద్యాధరరావు.

★ ★ ★

రమేశ్‌గారూ! వారి కథ మొదట్నుంచి మొదలుపెడ్తాను. అతని పేరు ఆశయ్య. అతన్ని మీరు చూసే ఉంటారు. పంచె మోకాలి పైకి కట్టేవాడు. తెల్ల సైను బనీను వేసేవాడు. చేన్ల వెంట పాటలు పాడుకుంటూ నడిచేవాడు. చేను పక్క యిప్ప చెట్టు కింద కారం మక్క గట్క సద్దిదిని శాలోల్ల మోట బావి వద్ద నీళ్ళు తాగేవాడు. మేదరి అంచె నిండా పిడుకలు ఏరుకొచ్చేవాడు.

అతని మరదలు సారవ్వను కూడా మీరు చూసే వుంటారు. బావ స్నానం చేసేవేళ కనిపెట్టి అటుకేసి ఏదో పని వున్నట్టు వెళ్తుండేది. మామిడి చెట్టు కింది మంగలోల్ల బావిలో డైకొట్టి ఈత కొడ్తేగానీ ఆశయ్యకు స్నానం చేసినట్టు అన్పించేది కాదు. డై కొడ్తుంటే అపుడపుడు గోచి గాలికి నడుమనే ఊసిపోయేది.

చూసీ చూడనట్టు చూసే సారవ్వ "ఛీ బావకు సిగ్గులేదు" అని అకస్మాత్తుగా అరిచేది. "సిగ్గు చిన్నప్పుడే పోయింది. మా అవ్వ ముడ్డికడిగినపుడే పోయింది" అనుకుంటూ డై కొట్టి నీళ్ళ లోతు అందుకునే వాడు ఆశయ్య.

"ఈతరాని మొకం గట్లనే ఒడ్డు మీదుండక ఏం జేస్తది" అని ఎక్కిరించేవాడు ఆశయ్య. సారవ్వకు రేషం ఎక్కువ. "నీకే వత్తదా- నాకెపుడో వచ్చు" అని రేషంగా ఆఫ్ లంగా గోచీపెట్టి దబీమని మోటబావిలో దూకేది. గాలికి గోచి ఊడిన లంగా గొడుగులా లేచేది. చెడ్డీలేని లంగ సిగ్గుదీసేది.

నీళ్లల్లో దరిపొంట నిలబడ్డ ఆశయ్య "నీ సిగ్గేదే పోరి...." అని చప్పట్లు కొట్టేవాడు. "ఛీ. నా సిగ్గు గూడ సిన్నప్పుడే పోయింది" అనుకుంట నీల్లలోతుకు చేరి బావకాల్లు గిచ్చి దూరంగా ఉరికేది. సిగ్గు దీసినందుకు నోటి నిండ నీళ్ళు పట్టి బావమీద పుక్కిలించేది. అవి మీద పడకుండా ఆశయ్య చేత్తో నీళ్ళు చల్లేవాడు. అక్కడికి స్నానానికి చేరుకున్నవాళ్ళు అది చూసి నవ్వేవాళ్ళు. అపుడు ఏమెరుగని పిల్లవోలె అమాయకంగా మారిపోయేది సారవ్వ.

వయస్సు వస్తున్నకొద్దీ మనస్సులు దగ్గరయ్యాయి. కలయికలు దూరమయ్యాయి. ఏకాంత పరాచికాలకు సంకోచించేది సారవ్వ. పదిమందిలో పరాచికాలకు మాత్రం బావతో పోటీపడేది. చదువులో బావతో పోటీపడలేక ఏడో తరగతికే ఆగిపోయింది. ఇంట్లో పని ఎక్కువై చదువు ఆపేయాల్సి వచ్చింది. ఆశయ్య అన్ని పనులు చేస్తూనే చదువుకుంటూ ముందుకు సాగాడు. అలా అని ఏ ఆటంకాలు లేకుండా అతని చదువు సాగలేదు. సెల్ఫ్‌లేని బండిలా అపుడపుడు ఆగుతూ ముందుకు సాగింది.

ఆశయ్య తండ్రి రాంరెడ్డి పటేలు వద్ద పాలేరుగా పనిచేస్తుండేవాడు.

ఆశయ్యకు నాయిన్నతో పటేలు యింటికి వెళ్తే ఏదో పని చెప్పేవాళ్ళు. రాంరెడ్డి పటేలు బిడ్డ మాలతితో పాటు తన పాలేరు కొడుకు ఒకే క్లాసులో చదువు కోవడం కంటగింపుగా ఉండేది. అయిదో తరగతిలోనే చదువు మాన్పించి తనవద్ద గొడ్లకు జీతం ఉంచుకుందామని చూశాడు గానీ ఆశయ్య నాయిన్న నర్సింలు అంగీకరించలేదు. నిజానికి ఆర్థికంగా లేకపోయినా నర్సింలు ఆశ ఆత్మవిశ్వాసమే సెల్ఫ్ అయి కొడుకు చదువు బండిని ముందుకు నడిపింది.

తొమ్మిదో తరగతిలో కొచ్చేసరికి నర్సింలు ఆశయ్యను చదువు మాన్పించక తప్పలేదు. ఏడాది ఎలాగోలా గడిచింది. నేను మళ్ళీ చదువుకుంటా నంటూ మారాం చేశాడు. తండ్రి వద్దని గట్టిగా వారించలేకపోయాడు. ఊళ్ళో ఉంటే చదువు యింతే సంగతులు అవుతుందని ఆశయ్యకు భయం పట్టుకుంది. వేసవి సెలవుల్లో కులం సర్టిఫికేటు తీసుకొని వర్షాకాలం రావడంతోనే తాలూకా సెంటర్లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లో చేరాడు. దాంతో మాలతితో ఒక తరగతి వెనకబడిపోయాడు.

పదో తరగతి సప్లమెంటరీలో పాసై యింటర్లో చేరాడు ఆశయ్య. దాంతో మాలతితో రెండేళ్ళు చదువులో వెనకబడ్డాడు. తనలాగే తన దోస్తులు పదో తరగతి రెండుసార్లు సప్లిమెంటరీ యిచ్చి యింటర్లో తనతో మళ్ళీ క్లాసుమేట్సు అవడం ఆశయ్యకు ఒక ఊరట.

ఆశయ్య యింటర్ ఫైనల్ తప్పడంతో పెళ్ళి ఊసెత్తాడు సారవ్వ తండ్రి పోచాలు. ఆశయ్య మనసు గువగువ లాడింది పెళ్ళి చేసుకోవాలని. నర్సింలు జాడించాడు. "వానికే పెట్టలేక సత్తున్నం. లగ్గం జేసి యిద్దర్ని సాదాల్నా" అంటూ. పోచాలు కన్నా ఆశయ్య ఆశ అడియాసైపోయింది. అయిందానికేమి - అని పట్టుదలతో యింటర్లో సప్లిమెంటరీతో గట్టెక్కాడు ఆశయ్య. ఆర్నెల్లు అదీ యిదీ చేసి ఏదో పని చేస్తున్నాడనిపించుకొని డిగ్రీలో చేరాడు ఆశయ్య. అప్పటికి మాలతి డిగ్రీ పూర్తయిపోయింది.

పాతపుస్తకాలు, నోట్సు కావాలని యింటర్ చదువుతున్నప్పటినుంచే మాలతి దగ్గరికి వెళ్ళేవాడు ఆశయ్య. రాంరెడ్డి పటేలు అది సహించేవాడు కాదు. ఆ విషయం ఆశయ్యకు తెల్సు. అందుకనే పటేలు యింట్లో ఏదో ఒక పనిచేస్తున్నట్టే చేస్తూ సమయం చూసి అడిగేవాడు. ఎవరూ చూడని ఆ సమయాల్లో మాలతికి ఆశయ్యను ఏడ్పించాలనిపించేది. చిన్నప్పట్నించి ఏదో మిషతో ఆశయ్యను ఏడ్పించడం అంటే మాలతికి ఎంతో సరదా. బూరుతోనే మక్కంకుల్ని మంటలో వేసి కాల్చి యిమ్మనేది. కాల్చి యిచ్చాక సగం తిని ఇది బాగా ముదిరింది తిని సూడు అని కొరికితిన్న పాలకంకిని ఆశయ్య

మీదకు విసిరేసేది. ఎంగిలిది తిని ఎలాగో మొఖం పెడ్తే "యిరవైమక్కంకులు దొంగతనంగ ఇరుసక పోయినవ్" అని నాన్నకు చెప్పి కొట్టిస్తానని బెదిరించేది. ఇలా ఎన్నో....... సారవ్వ సాక్షిగా చిలిపిగా అతని శరీరంతో, మనసుతో ఆడుకునేది.

చిన్నప్పట్నించీ మాలతికి ఆశయ్యంటే పెద్ద గౌరవం ఏమీలేదు. తమ పాలేరు కొడుకు అనే చిన్నచూపు కూడా ఉండేది. సారవ్వ నేర్పుతున్నదనే నెపం చూపుతూ ఆశయ్యతోనే ఈత నేర్చుకొంది మాలతి. వయస్సు పెరుగుతున్న కొద్దీ సారవ్వ ఉన్నంతసేపు పాలేరును చూసినట్టే అధికారం చెలాయించేది. సారవ్వలేకపోతే ముభావంగా తప్పుకు తిరిగేది.

"ఆశయ్య నీ మేనల్లుడేనాయె నీకెందుకే అల్లర" అని అయినవాల్లు అంటున్నా సారవ్వకు సంబంధాలు వెతికే ప్రయత్నం చేశాడు తండ్రి పోచాలు. సదువంత అయినంక సదువులేని పిల్ల నాకు అల్లనంటే గా వయసుల పోరికి సంబంధం ఏడ దొరుకాలె అనేది కన్నతండ్రి బాధ. రాకరాక వచ్చే సంబంధాల్ని తిరగ్గొట్టేది సారవ్వ. "ఏందే పోరీ! మరి బావనే చేసుకుంటవా ఏందే" అని దగ్గరోల్లు అడిగితే సారవ్వ మూతి మూడు వంకర్లు తిప్పేది.

"ఆడే దొరికినాడు. ఓ సిగ్గు లేదు. శరం లేదు. ఆడోల్లుండగనె బనీను యిడ్సి జాంగ మీద తానం జేత్తడు. ఏరుగ కూసుండి ఆడోల్లు కనపడ్తె లెవ్వనన్న లెవ్వడు. సాటుకన్నవోడు. అందరు జూడంగ తొవ్వపొంటనే నిలవడి ఉచ్చవోత్తడు. అందరి ముంగట్నే గజ్జలల్ల పర్ర పర్ర గోకుతడు. గింత సిగ్గులేని మొగోన్ని నేను అసలే చేస్కోను." అని తీరు తీరునా వర్ణించి వంకలు పెట్టేది సారవ్వ. "ఛీ పోరి, మొగోల్లను గంతగనం సూత్తావె" అని వరుసైన ఆడోల్లు ఎకసక్కెం చేసేవాళ్ళు.

చిన్నప్పట్నించి ఆశయ్య మనసు సారవ్వ మీదే ఉండేది. గోచి బిగకట్టి పనికి సాగిందంటే సారవ్వతో పనిలో పోటికి మొగోల్లు సైతం జడిసేవాళ్ళు. కండపట్టి మోటుదేలిన అందంతో మిలమిల మెరిసేది సారవ్వ. ఓసారి చెలుకలల్ల ఎవలు లేకుండా చూసి చేయి లాగాడు ఆశయ్య. చర్రున కోపంతో చూసి మూతి ముడుచుకుని చరచరా వెళ్ళిపోయింది. తల్లిదండ్రులకు చెప్పి మానం తీస్తుందని భయపడ్డాడు. కానీ సారవ్వ ఆ విషయం ఎవరికీ చెప్పలేదు. మాలతికి ఆశయ్యకూ మధ్య మధ్యవర్తిలా తన సాయం మాననూ లేదు.

ఓ రోజు ముగ్గురూ బయల్దేరి యిద్దరిని చేనుమధ్య రేగు చెట్టుకింద వదిలి ఏదో పని ఉన్నట్టుగా వెళ్ళిపోయింది సారవ్వ. ఆమెకాల్చి పెట్టిపోయిన శనక్కాయలు బుక్కుకుంటూ పొట్టు ఆశయ్య మీద విసిరేసుకుంటూ ఆ రోజు మాలతి ఏదేదో మాట్లాడింది. ఆశయ్యకు అయోమయం అయిపోయింది. బెరుకుగా ఉండింది. ఆ బెరుకును యింట్లో గుమ్మాల చాటున మాలతే తీర్చింది. ఆనక అలవాటై పిరికి గొడ్డుతో తన యిష్టం వచ్చినట్టుగా ఆటాడుకునేది.

భార్య కావాల్సిన సారవ్వ ఇద్దరికీ మధ్యవర్తి అయి, కాపలాదారు అయి ఎవర్తోనూ అపవాదు రాకుండా కాపాడే సాక్షిగా మారిపోవాల్సి వచ్చింది. ఆమె తన గుండె కోత ఎవరికీ చెప్పుకోలేదు. వయస్సు పెరుగుతోందని ఏదో సంబంధం చూసి పెళ్ళి చేశారు. సారవ్వ ఆ సంబంధాన్ని వద్దననూలేదు. అవుననానూ లేదు. ఏవో సంగాలంటూ తిరుగుతుండిన వెంకటయ్య కూడా యిదే స్థితిలో ఉండగా అతన్తో సారవ్వ పెళ్ళయిపోయింది.

ఆశయ్య చదువు ఆగలేదు. సారవ్వకు యిద్దరు పిల్లలయ్యారు. మాలతికి సంబంధాలు వెతుకుతున్నారు. ఈ లోపే ఎమ్మే చేసి బీఈడీ కూడా పూర్తి చేసింది మాలతి.

యూనివర్సిటీలో పడ్డ ఆశయ్య విద్యార్థి సంఘాల్లో పడ్డాడు. స్కాలర్‌షిప్ కోసం ఎపుడూ ఏదో ఒక కోర్సులో సీటు సంపాదించేవాడు. బాగా చదవాలని బుద్ధి కలిగాక విద్యార్థి రాజకీయాలు సమయాన్ని తినేయడం ఆశయ్యకు లోలోన బాధగానే ఉండేది. కాని ఆ రాజకీయాల్లో దొరికే గుర్తింపు

గౌరవం అవి పెంచే ఆత్మవిశ్వాసం చూసి వాటికి దూరం కాలేకపోయాడు.

ఉద్యోగం వచ్చినఏడే ఆశయ్యకు లక్ష్మితో పెళ్ళి కూడా అయిపోయింది. కొద్ది నెలల తేడాతో మాలతిక్కూడా ఉద్యోగం దొరికింది. పెళ్ళీ జరిగిపోయింది. మాలతి భర్త రాజిరెడ్డి ఎస్సయిగా పనిచేస్తాడు.

ఆసరికి మాలతి నాన్న రాంరెడ్డి ఊళ్ళొంచి మకాం మార్చేసి తాలూకా సెంటర్లో స్థిరపడ్డాడు. మాలతి తమ్ముడు ఇంటర్లోనే గజనీ మహమ్మద్ దండయాత్రలు చేస్తుంటే సారా కాంట్రాక్టరుగా పొత్తులో కుదిర్చాడు రాంరెడ్డి. సారవ్వ భర్త వెంకటయ్య యింటికి రావడం మానేశాడు. నక్సలైట్లలో కల్సాడన్నారు. వాని భయానికే రాంరెడ్డి ఊర్లోకి వస్తలేడు అని పుకారు లేసింది. నిజమెంతో తెలియదు.

వెంకటయ్యను వెతికే పనిలో ఎస్సయి రాజిరెడ్డి సారవ్వపై దౌర్జన్యం చేసి తానూ నలుగురు కానిస్టేబుల్స్ అత్యాచారం చేశారు. అది ఆ వూరిని భయకంపితుల్ని చేసింది. సారవ్వ పిల్లల్ని తీసుకొని తల్లిగారింటికి చేరింది.

సారవ్వను తన భర్త రేప్ చేసిన విషయం మాలతి జీర్ణించుకోలేకపోయింది. అతనితో సంబంధం యాంత్రికంగా మారిపోయింది. రక్తం అంటిన కొడవలికి అతను గుర్తుగా మారాడు. బలిష్టమైన అతని పట్టు తనపై కూడా అత్యాచారం చేస్తున్నట్టుగానే అన్పించేది. క్రమంగా అదే అలవాటై పోయింది. ఆశయ్యతో తొలి రోజుల్లో గడిపిన క్షణాల్లోని స్వేచ్ఛ, ఆనందం గుర్తొచ్చినపుడల్లా తానేదో కోల్పోతున్నానని బాధపడేది.

సారవ్వ పెనిమిటి వెంకటయ్యను పట్టుకున్నది రాజిరెడ్డే అని తెల్సినాక మూడు రోజులకు సారవ్వా ఆశయ్యా - మాలతి యింటి ముందు ప్రత్యక్షమయ్యారు. మాలతీ, సారవ్వా ఏదో రూపంలో సన్నిహితులని తెల్సి ఏదోలా అయ్యాడు రాజిరెడ్డి. కర్తవ్యం అతన్ని ఏ సాయమూ చేయనీయలేదు. అప్పటికే వెంకటయ్య పై అధికారుల అదుపులోకి అప్పగించబడ్డాడని చెప్పాడు. వారం రోజుల చిత్రహింసల తర్వాత ఏదో కేసు పెట్టి జైలుకు పంపారు. మాలతి మాట వెంకటయ్య ప్రాణం పోకుండా కాపాడింది గానీ జైలును తప్పించలేకపోయింది.

రాజిరెడ్డి మాలతిని ఉద్యోగం మానేయిమనేవాడు. మాలతి ససేమిరా అంది. ఆశయ్య తన భార్య లక్ష్మిని మరింత చదువుకొమ్మని ఉద్యోగం చేయమని పోరేవాడు. లక్ష్మికి కూడా చదువంటే ఉత్సాహమే. ఇంటికి వెళ్ళినపుడు సారవ్వను కూడా మళ్ళీ చదువుకో అని ప్రోత్సహించేవాడు ఆశయ్య. "ఈ పోరగాన్లను పట్టుకొని కూలిపని చేసుకుంటూ ఎట్ల సదువుకోవాలె" అని విషాదంగా నవ్వేది. ఆ విషాదంలోనూ "చదువుకున్న నువ్వు చేసుకుంటే నాకిన్ని కష్టాలుండునా-నీ స్వార్థం వల్లగాదా-నాకీ కష్టాలు" అని వ్యంగ్యంగా మాటలంటుండేది.

ఇప్పటికైనా కల్సి ఉందామా అని అడగబోయేవాడు. ఆమె భర్త నక్సలైటు గనక నక్సలైట్లంటే ఉండే భయంతో ఆ మాట పెదవి దాటకపోయేది. కళ్ళల్లోని ఆ కోర్కె పసిగట్టి "అలా కల్సి ఉంటే మాత్రం నేను పెళ్ళి-పెళ్ళాన్నవుతానా! - కాని ముచ్చట ఎందుకు" అని కళ్ళతోనే జవాబిచ్చేది సారవ్వ.

ప్రసూతికంటూ తమ్ముని యింటికొచ్చిన మాలతి ఆశయ్యకు కబురు చేయడంతో వెళ్ళక తప్పింది కాదు. వాళ్ళ నాన్న రాంరెడ్డిలో మునుపటి బింకం లేదు. ఓడిపోయిన ముసలి నక్కలా ఆ చూపులు మాత్రం అసహనం ప్రదర్శించేవి. కాని దాన్ని కప్పి పుచ్చే ప్రయత్నం చేసి నవ్వేవాడు. "ఏంరా ఆశయ్యా మంచిగున్నవా" అంటూ పలకరించేవాడు. "మా పొలం అమ్ముత. రెండెకరాలు కొనుక్కోరాదురా" అని అడిగేవాడు. అది వ్యంగ్యమో-నిజంగానే అంటున్నాడో ఆశయ్యకు అర్థంకాక పోయేది. "మీ తమ్మునికన్న యింతపని చేసికొని బతుకుటానికి పనికొస్తది గదర" అని రాంరెడ్డి అనేసరికి అది నిజమేనని తోచేది. తాను చదువుకుంటూ పోతుంటే పనిలో యిరుక్కుపోయిన తమ్ముడు నారాయణ తొమ్మిదో తరగతి మించి చదవలేక పోయాడు. ఇపుడు సుతారి(తాపీమేస్త్రీ) పని చేస్తున్నాడు.

సారవ్వ చెల్లెను అతనికిచ్చి పెళ్ళి చేశారు. తమ్ముడు నారాయణ ఉన్నంతలో బాగానే బతుకుతున్నాడు. మునుపటి అంత పేదరికం ఏమీ కాదుగానీ మరీ బాగా బతుకు తున్నాడని కాదు. రాంరెడ్డి పటేలు సూచన బాగానే ఉంది కానీ - నక్సలైట్లు కొననీయడం లేదు - అమ్మనీయడం లేదు. ఆశయ్య తండ్రి నర్సింలుకు తన జీవితమంతా పనిచేసిన భూమి కొంత తమది కావడం అనే ఊహే ఎక్కడ లేని ఆనందాన్నిస్తోంది. అది కొంటే రాంరెడ్డినే కొనగలిగాను అనే తృప్తి ఆత్మవిశ్వాసం అతని మందగించిన చూపులో వెలుగు నింపుతుంది. కొన్నాక అందులో తనకు వాటా ఎంతుంటుందో, లేదో అనే విషయం తేల్చుకోలేక నక్సలైట్లతో కిరికిరి వద్దంటూ వాయిదా వేశాడు ఆశయ్య.

ఎవరూ లేని సమయం చూసి తన మనసులో మాట ఆశయ్య ముందుంచింది మాలతి. "నేను విడాకులు తీసుకోవాలనుకుంటున్నాను. అతన్తో యిక వేగలేను." అంది. ఆశయ్య మీద పిడుగుపడ్డట్టుగా ఫీలయ్యాడు. తనను పెళ్ళి చేసుకోమంటుందా! పోలీసోల్లతో కిరికిరి ఎవరు పెట్టుకుంటారు. అదే జరిగితే ఎన్‌కౌంటర్ పేరిట తనను పిట్టను కాల్చినట్టు కాల్చి పారెయ్యడా! కడుపులో ఉన్న శిశువు మాటేమిటి! తన భార్య మాటేమిటి - లోకం మాటేమిటి? అని పరిపరి విధాలపోయాడు.

మాలతి సూటిగా ఆశయ్య కళ్ళల్లోకి చూసింది. అతని కళ్ళల్లో మునుపటి అమాయకత్వం లేదు. అతనిలో యిపుడు పురుషుడు కనపడుతున్నాడు. గతంలో అతనిలో చూసింది ఇది కాదు. అతనిలోని స్త్రీవంటి బేలతనాన్ని అపుడు ప్రేమించింది. అపుడు తాను మగమహారాజు. అతడు ముగ్ధ స్త్రీ. అదేవారి సంబంధం. ఇపుడా కళ్ళల్లో ఆమె కోరుకున్న స్త్రీ లేదు. అతనూ అందరి లాంటి పురుషుడయ్యాడు. కులం పోగొట్టిన ఆత్మవిశ్వాసాన్ని ఉద్యోగం, అనుభవం అతనిలో నింపేసరికి అతనూ అందరిలాంటి మగవాడే అయ్యాడు. ఈ విషయం అర్థం అయీ కాకుండా - కొంత అర్థం అయినా దాన్ని మాలతి జీర్ణం చేసుకోలేకపోయింది. ఆశయ్యలో తాను కోరుకున్నది యిది కాదు. ఇతను మునుపటి ఆశయ్య కాదు. ఇతను తనకవసరం లేదు అని నిశ్చయించుకుంది. మనస్సు మార్చుకుంది. కాని అప్పటికే హృదయం జారింది. మాట వెలువడింది.

"ఎందుకలా అనుకుంటున్నారు. మీకన్నా మీ ఆయనకు కాస్త జీతం తక్కువైనా సంఘంలో అతని హోదా పెద్దది. పైసలకు కొదువలేదు. సుఖానికీ కొదువలేదు" అతను నాకన్నా బలిష్టుడు కూడా అని మనసులో ఉంచుకొని చివరి వాక్యం ఒత్తి పలికాడు ఆశయ్య.

మాటమార్చాలనుకున్న మాలతి రోషంతో ఆమాటే మరిచిపోయింది. "రేప్‌లో సారవ్వ మా ఆయనతో సుఖపడిందే అంటావా? అది సుఖమే నంటావా!"

అరిచినంత పనిచేసిన ఆ మాటకు ఉలిక్కిపడ్డాడు ఆశయ్య. ఎవ్వరైనా విన్నారేమోనని కిటికీల తలుపుల వైపు చూశాడు. ఏదో అనునయించాడు. అతని సానుభూతితో ఆమెలో దుఃఖం పెల్లుబికింది.

"ఆశయ్యా! నిన్ను మళ్ళీ అరే ఆశిగా అని పిలువాలని పిస్తోందిరా! నా ఆశిగాడు-నాకు మళ్ళీ కావాలనిపిస్తోందిరా! అపుడు నిన్నువాడుకున్నాను అనుకున్నాను గానీ - అదే నిజమైన ప్రేమ అని యిపుడు అన్పిస్తోందిరా. నాకులం యిచ్చిన అహంకారం ఆనాడు ఈ మాటనీతో అననీయలేదురా. నీవు మళ్ళీ నా ఆశిగానివి కాగలవా! నేను మా ఆయనకు దూరంగా ఉంటాను. లేదా నీ కోసం ఆయనతో ఎలాగోలా సర్దుకుపోతాను. నీతో నాకొక కొడుకును కనాలని ఉందిరా. నాకు నా మునుపటి ఆశిగాడు కావాలిరా - ఆ చిలిపి చేష్టలు కావాలిరా!"

ఆశయ్యకు ఉద్రేకం ఒక పక్క - భయం ఒకపక్క - కొంతసేపటికి శరీరం సల్ల చెమటల్తో తడిసిపోయింది. మాలతితో తాను సుఖపడి సారవ్వకు చేసిన అన్యాయం గుర్తొచ్చింది. అన్నీ ఉండి మాలతే యింతగా బాధపడ్తుంటే - ఏమీలేని సారవ్వ బావగురించి ఇంతకన్నా ఎంత బాధపడి ఉంటుందో. తెల్సీ తెలియని వయసులో తాను ఎంత తప్పు చేశాడు. మాలతిని తాను చదువుకున్నదని

భ్రమిసాడా! ఆమె కులానికో అధికారానికో తాను లొంగిపోయాడా! లేక తాను మాలతిని నిజంగానే ప్రేమించాడా! తాను నిజంగానే మాలతిని ప్రేమించేదైతే సారవ్వ మాటేమిటి? సారవ్వకు తన హృదయంలో ఉన్న స్థానం మాటేమిటి? ఆవేదనలో పడిపోయాడు ఆశయ్య.

"అసలు మీరు యిలాంటి నిర్ణయానికెందుకొచ్చారు. తెల్సీ తెలియని వయసులో జరిగిపోయిన వాటిని జ్ఞాపకాలుగా మిగుల్చుకుంటేనే సంతోషంగా ఉంటుందేమో." వాస్తవాలతో రాజీపడిపోయిన ఆశయ్య అంతకన్నా మాట్లాడలేకపోయాడు.

"నిజం చెప్పనా! పెళ్ళయిన కొత్తలో అతనిలో నిన్నే చూసుకునేదాన్ని. నువ్వే అతడని భావించుకునేదాన్ని. కాని అతడు నీ స్థానాన్ని ఆక్రమించలేకపోయాడు. అతని వ్యక్తిత్వం వేరు. అతడిలో నిన్ను చూసుకోవడం ఎన్నాళ్ళో సాగలేదు. అతను లాకప్పుల్లో పెట్టే చిత్రహింసలు గురించి విని అతనికి మనవిషయం తెలిస్తే నా పట్ల యిట్లాగే ప్రవర్తిస్తాడేమోనని భయం వేసేది. అతను స్త్రీలపై చేసే అత్యాచారాల గురించి విని విస్తట్లోని ఎంగిలి కూడుకు ఆశపడే కుక్క అన్పించింది. ఆ ఎంగిలితో నా శరీరం మైలపడ్డట్టనిపించేది. అతను కల్సినపుడల్లా వాళ్ళంతా గుర్తొస్తారు. నాపై కూడా అత్యాచారం చేస్తున్నట్టుగానే అన్పించేది. నిజానికి అతన్తో ఆ కొద్దిసేపు ఎంతో సుఖం అన్పిస్తుంది. కాని ఆ భావం ఎంతో సేపు నిలవదు. అతన్తో కాపురం చేయలేను."

తన భార్య లక్ష్మికి పెళ్ళికాక ముందు మాలతికి ఆశయ్యలా - లక్ష్మికి ఎవర్తోనైనా అనుభవాలున్నాయని తెలిస్తే తాను ఎలా ఫీలవుతాడు - అని మొదటిసారి ఆలోచించాడు ఆశయ్య. దాంతో మనసంతా అల్లకల్లోలం అయిపోయింది. సారవ్వపై మాలతిపై ఆశ పెంచుకోవడం ఎంత తప్పు - అని గింజుకున్నాడు.

ఈ ఆలోచనలోనూ ఏదో పొరపాటుందనిపించింది. తన భార్య పవిత్రంగా ఉండడం కోసం మాత్రమే తనది తప్పు అనుకుంటున్నాడు. తన భార్యకూ అలాంటి లవ్ఎఫైర్స్ సహజమే అని అంగీకరిస్తే తనది తప్పు కాదన్నమాట - తన యిప్పటి ఆశకూడా తప్పుకాదన్నమాట. అని ఎవరో వ్యంగ్యంగా తనను ప్రశ్నించినట్టనిపించి చకితుడయ్యాడు ఆశయ్య. తాను ప్రేమపేరిట వారి శరీరాల్ని కోరుకుంటున్నాడా!

తన మనస్సు తనను మోసం చేయడం లేదు. తాను ముగ్గుర్నీ ప్రేమిస్తున్నట్టు హృదయానికి తెల్సు. కాని సమాజం ఈ మాటను అంగీకరిస్తుందా! తాను కూడా ఓ ముగ్గుర్ని ద్రౌపదిలా సమానంగా ప్రేమిస్తున్నానని లక్ష్మి అంటే తాను నమ్మగలడా - నమ్మితే ఆమెను భార్యగా భరించగలడా!

మాలతికి కూతురు పుట్టింది. ఏవో సాకులు చెప్తూ పుట్టింట్లోనే ఉంటోంది. రాంరెడ్డి ఆశయ్యను పొలంకొనుమని పోరుతూనే ఉన్నాడు గానీ ఆశయ్య తమ్ముడు నారాయణ నక్సలైట్లలో కలిశాడు. ఆశయ్య అంబేద్కర్ సంఘాల నిర్మాణం చేపట్టాడు. అతని భార్య లక్ష్మి ప్రయివేటు స్కూల్లో పని చేస్తోంది.

వెంకటయ్య జైలునుండి బేలుపై విడుదలయ్యాక సారవ్వ యింటిపైకి పోలీసుల దాడులు మళ్ళీ మొదలయ్యాయి. క్రమంగా వెంకటయ్య పార్టీకి దూరం అయ్యాడు. పోలీసు కనపడగానే రేప్ - చిత్రహింసలు గుర్తొచ్చి సారవ్వ గజగజ వణికిపోయేది. ఆ వూరు వదిలేద్దాం అని పోరింది. వెంకటయ్య సరేనన్నాడు. తాలూకా సెంటర్లోకి మకాం మార్చాక రాజిరెడ్డి వారి పత్తా దొరికించుకున్నాడు. ఏం బెదిరించాడో సారవ్వ అతనికి లొంగిపోయింది. రాజిరెడ్డి ఉంచుకున్నదని పోలీసుల్లో పేరుపోయాక కొన్నాళ్ళకే ఆమెను వదిలేశాడతను. వాని పీడా పోయిందని వెంకటయ్య అనుకునేంతలో రేప్‌లో పాల్గొన్న హెడ్‌కానిస్టేబుల్ ఒకడు బ్లాక్‌మేల్ చేయడం ప్రారంభించాడు. బతుకు మీది భయంతో చిత్రహింసలు గుర్తొచ్చి ఆ బతుకు మళ్ళీ వద్దనుకుని వాడు వచ్చేవేళకు తప్పుకుని ఎటో వెళ్ళేవాడు వెంకటయ్య. సారవ్వ యిద్దరి మధ్య బలిపశువైపోయింది. వాడితో పాటు మరో పోలీసు ఆ దారి తొక్కడంతో ఎవరికి చెప్పాలో తెలియక వెక్కివెక్కి ఏడ్చింది. అపుడపుడు ఎక్కడెక్కడికో తీసికెళ్ళి

ఎవరెవర్తోనో కలిపి తలుపువేసి పోయేవారు. ఓ రోజు పిల్లల్ని ముందేసి రాయి మెడకు కట్టుకుని తానూ బావిలోకి దూకేసింది. పిల్లలు చనిపోయారు. సారవ్వ బతికింది. గాయాలు మాని నెలకు యింటికి చేరింది. హత్య-ఆత్మహత్య నేరం కింద అరెస్టు చేయాలన్నారు. చచ్చినా సరే యిక లొంగను అనుకొని ఎదిరించడంతో వారు జైల్లో తోశారు.

జైల్లో ఒక నక్సలైటు ఆడఖైదీతోపాటు, అత్తమామల - భర్త ఆగడాలకు వేగలేక భర్తను చంపిన స్త్రీ సారవ్వకు తోడయ్యారు. వెంకటయ్యకు సారవ్వ మీద మనసులేకపోవడంతో బేల్ ప్రయత్నాలేవీ చేయలేదు. అతని బేల్కోసం అతని ప్రాణం కోసం తన సర్వస్వాన్ని ధారపోసిన సారవ్వకు అతనేమీ కాలేకపోయాడు. అతని వల్లనే ఆమె జీవితం అలా అయిందనే వాస్తవాన్ని అరిగించుకోలేక పెళ్ళికి ముందే ఆశయ్యతో కడుపుచేసికొని రెండుసార్లు దిగదాగిందట - దాన్ని నాకు అంటగట్టారు అని ప్రచారం ప్రారంభించాడు వెంకటయ్య.

ఆ విషయం విని సారవ్వ హృదయం బండబారి పోయింది. తాను వెంకటయ్యను ఎంతగా ప్రేమించిందో ఎవరికి చెప్పుకోగలదు. తనకు అంతటి భాష కూడా రాదు. గతమంతా గుర్తొచ్చి విలవిలా ఏడుస్తుంటే ఆ యిద్దరు ఖైదీలే ఆమెను ఓదార్చారు. తాను ఫలానా వాడికి ఛాన్సు యివ్వకపోవడంతో వాడు లీక్చేసి తాను అరెస్టయ్యేట్టు చేశాడని నక్సలైటు ఖైదీ శారద వాపోయింది. మనం ముగ్గురం పార్టీలో చేరదాం. వాడి సంగతేదో చూద్దాం. వాడేదో చేశాడని వీడేదో చేశాడని మనం ఉద్యమాన్ని వదలవద్దు. వాళ్ళు రేపులకన్నా - చిత్రహింసలకన్నా యింకేం చేయగలరు. వాటికి కూడా తెగించగలిగితే యిక మనను ఎవరేం చేయగలరు అంటూ ధైర్యం చెప్పింది శారద.

పోలీసులు పెట్టే చిత్రహింసలను శారద వర్ణించి చెప్పుతుంటే భర్తను చంపిన సుశీలకు నవ్వువచ్చేది. తాను యింట్లో అంతకు తక్కువేమీ బాధలు అనుభవించలేదు. శత్రువు కొడ్తుండంటే మనసు రాయి చేసుకొంటాం. కాని అయినవాడు అని హృదయం యిచ్చినవాడు కొడ్తుంటే మనస్సు చిత్రవధ అవుతుంది. శత్రువు కొట్టేగలిగేది నీ శరీరాన్నే. నీ మనస్సును వాళ్ళేమీ చేయలేరు. కాని నా అనుకున్న హృదయాన్నిచ్చిన వాళ్ళ చిత్రహింస శరీరంతో పాటు మనస్సును ఎక్కువ చిత్రవధ చేస్తుంది. అని సుశీల అంటుంటే ఆ హింస తెలియకుండా గారాబంగా పెరిగిన శారద నోరెళ్ళబెట్టేది. ఈ రెండూ అనుభవించిన సారవ్వ నిజమే అంటూ విషాదంగా నవ్వేది.

సన్నిహితులు సున్నితంగా ఆశయ్యకు బాధ్యతను గుర్తుచేయడంతో సారవ్వ కోసం బేల్ ప్రయత్నాలు ప్రారంభించాడు. అడ్వకేటును వెంట తీసుకొని జైలుకు వెళ్ళిన ఆశయ్యకు చుక్కెదురైంది. "బయటకు వచ్చి నేనేం చేయాలి" సూటిగా ప్రశ్నించింది సారవ్వ.

అవును ఇపుడు సారవ్వ ఏకాకి. నమ్ముకున్న భర్త నట్టేట ముంచాడు. కనుకున్న పిల్లల్ని చేతులారా చంపుకుంది. లోకం దృష్టిలో శీలంలేని ఆడది అయింది. ఇక తనను ఎవరు దగ్గరికి తీస్తారు. తలను ఎడవాసిన వెంట్రుక తాను. తనకిప్పుడు ఏ కుదురూ లేదు. వెక్కి వెక్కి ఏడ్చింది సారవ్వ. అతను ఆమెను ఓదార్చడం కోసం వారి మధ్య నుండి తప్పుకుని బయటకు నడిచాడు అడ్వకేటు. ఆశయ్య ఓదార్చాడు. సారవ్వ విషాదంగా నవ్వింది. మళ్ళీ కళ్ళనీల్లు పెట్టుకుంది.

"బావా నిన్నూ నన్నూ దూరం చేసింది చదువే గదా. నీవు చదువు ఆపేసినా మనకిద్దరికి పెళ్ళయ్యేది. నేను చదువుకోగలిగినా మనిద్దరికి పెళ్ళయ్యేది. మనల్నిద్దర్ని దూరం చేసిన ఆ చదువునే ఈ జేల్లో నేర్చుకుంటాను. నేనే చదువుకొని ఉంటే నువు మాలతివెంట పడేవానివా!"

మాలతితో తనకు జరిగింది యిలాగేనా-లేక యిది సారవ్వ కోణం మాత్రమేనా - అర్థం కాలేదు ఆశయ్యకు. "జైల్లో వారానికి రెండు మూడు కార్డులిస్తారట గదా అపుడపుడు ఉత్తరాలు రాస్తూ ఉండు." అంటూ ఆమె నిర్ణయాన్ని మార్చలేక జైల్లో ఆమె ఖాతాలో కొంత డబ్బు జమచేసి సెలవు తీసుకున్నాడు ఆశయ్య.

"చాలా చక్కగా చెప్పి పంపేసావు" అని సారవ్వను శారద అభినందించింది. "బయటకు వస్తే నీతో మళ్ళీ ఏదో లవ్ ఎఫేర్ ప్రారంభిద్దామనుకుంటున్నాడేమో. అందుకే మాలతి దగ్గర ఉండుమన్నట్టున్నాడు" అని అర్థాలు తీసి థూ ఈ మొగాళ్ళంతా యింతే అన్నట్టు ఉమ్మేసింది శారద.

రెండో పెళ్ళికి అన్నీ సిద్ధం చేసుకొని మాలతితో విడాకుల కోసం లాంఛనంగా రాయబారం పంపాడు రాజిరెడ్డి. మొదటి పెళ్ళి అపుడు యిచ్చేదానికన్నా ఎక్కువిచ్చి రెండో పెళ్ళివాన్ని కొనుక్కుంటున్న ఆ పిల్లకూడా బాగా చదువుకున్నదే అని తెల్సి ఎలా ఉంటుందో చూడ్డం కోసమైనా ఆమె యింటికి వెళ్దామా అనుకుంది మాలతి. విడాకుల పత్రాలపై సంతకాలు చేసి పంపేసింది. ఆ పెళ్ళి పిల్ల యింటికి వెళ్ళి కలవడం అంటే ఏదో రూపంలో అతని పట్ల తన (డ్యూటీ) ఛార్జీని ఆమెకు మంచి చెడ్డల్తో సహా అప్పగించి రావడమే. అతనూ ఆమె తిరిగి ఫ్రెష్‌గా జీవితాన్ని ప్రారంభించే అవకాశం వచ్చినపుడు తాను గతమనే పాతగీతల్ని గీసిరావడం ఎందుకు. ఒక ప్రేక్షకురాలిగా ఆ పెళ్ళికి వెళ్దామనుకున్నా - తన గతం వల్ల అపార్థాలు చేసుకోవడం - పెళ్ళి రసాభాసగా మారడం జరుగుతుందేమోనని ఆగిపోయింది మాలతి.

వర్తమానంలో మన ప్రమేయం ఏమీ లేకుండా గతం తన ప్రభావం వేస్తుంది. తన ప్రమేయం లేకుండానే సాగిపోయిన గతం కూడా సారవ్వ వర్తమానాన్ని వెంటాడుతోంది. వర్తమానాన్ని శాసించగలను అనుకుని యిష్టారాజ్యంగా ప్రవర్తించిన రాంరెడ్డి గతం రాంరెడ్డిని వెన్నాడుతోంది. ఇపుడతను కొడుకునుగానీ కూతుర్నుగానీ యిలాగే బతకాలి అని శాసించే స్థితిలోనైనా లేడు. నక్సలైట్లకు అడ్రసు తెలియకుండా ఆ బంధుత్వం - ఈ బంధుత్వం పేరిట నగరాలు తిరిగే కాందిశీకుడయ్యాడు. చేసేది సారావ్యాపారం. తండ్రి కూడా తన వద్దే ఉంటే తన వీపుకూడా పగులుతుందేమోనని కొడుకు భయం. తండ్రి తన యింట్లో తిష్ట వేయకుండా ఉండేందుకు ఒకటికి రెండు కల్పించి వస్తే వెంటనే ఉచ్చపోసుకొని పారిపోయేట్టు చేసేవాడతను. ఆశయ్య తమ్ముడు నారాయణ భయమే రాంరెడ్డిని బాగా పట్టిపీడిస్తుండేది. వాడు నక్సలైట్లలో చేరింది తన మీద పగతీర్చుకోవడం కోసమే అని అతని కలత నిద్రల్లో కలవరింతలు.

అయితే నారాయణ రాంరెడ్డిని అతను భయపడ్డట్టేమీ చేయలేదు. అసలతను ఆ ఏరియాలో కాకుండా వేరే ప్రాంతంలో పనిచేసేవాడు. ఎందుకోగాని అతను కొన్నాళ్ళకు నక్సలైట్లలోంచి బయటకు వచ్చేశాడు. బయటకు వచ్చిన నారాయణ ఊరికే ఉందామంటే అటువాళ్ళూ ఉండనీయలేదు. ఇటు వీళ్ళూ ఉండనీయలేదు. తెల్సిన స్నేహితులు సరేసరి. ఏదో రూపంలో తిరిగి రాజకీయాల్లోకి రాకతప్పలేదు. పార్టీ వద్దని సూచించినా కావాలని పోటీ చేసి సర్పంచుగా ఎన్నికయ్యాడు. వరుసగా రాంరెడ్డి తండ్రి - ఆ తర్వాత రాంరెడ్డి - అతని తమ్ముడు లక్ష్మారెడ్డి యింతదాకా సర్పంచులవుతూ వచ్చారు. ఆ చరిత్రను ఓడించి లక్ష్మారెడ్డి మళ్ళీ సర్పంచ్ కాకుండా ఒక దళితుడు సర్పంచ్ కావడం మాత్రం విప్లవం కన్నా తక్కువా ఏమిటి అనే నారాయణ చర్చలు జనాన్ని ఆకట్టుకున్నాయి. అతనికున్న మంచిపేరు కూడా అందుకు తోడైంది. నారాయణకు అలా నక్సలైట్లలో పనిచేసిన గతం అతని మంచికి ఉపయోగపడింది. అదే గతం వెంకటయ్య సారవ్వను గాలికి వదిలేసి అరబ్బు దేశాలకు పనివెతుక్కుంటూ పారిపోయేటట్టు చేసింది. అదే గతం సారవ్వను శీలంలేని ఆడది అని ముద్రవేసింది.

ఆర్థిక స్వాతంత్ర్యంతో తన కూతురుతో ఒంటరిగా బతుకుతున్న మాలతిని చూస్తుంటే ఆశయ్యకు ఆవేదనగా ఉండేది. తనవల్లే ఆమె జీవితం యిలా అయిందని తానామె జీవితంలో ప్రవేశించి ఉండకపోతే ఆమె హాయిగానే బతికి ఉండేదని బాధపడేవాడు. సారవ్వ జీవితాన్ని మాత్రం సమాజం క్రూరంగా బలితీసుకుంది. తెలియక చేసిన తప్పులకు కూడా శిక్షలు వేస్తూ జీవితం ముందుకు సాగిపోయింది.

తన కులాన్ని తాను కొంత కడిగేసుకున్నట్టుగా తన కులం కారణంగా జరిగిపోయిన తన

గతాన్ని కూడా కొంత సరిచేసుకోలేడా? తమ్ముడు నారాయణ తన గతాన్ని తనకను కూలంగా మార్చుకోగలిగాడు. సారవ్వ అలా మార్చుకోవడం సాధ్యమేనా! తనకు మాత్రం సాధ్యమా!

క్షమాగుణం లేని జీవితం మనిషిని హేయంగా మార్చి క్రూరున్ని చేస్తుంది. పశ్చాత్తాపంతో దహించుకుపోయి పునీతులై తిరిగి కొత్త జీవితాన్ని కోరుకునే మనిషిని క్షమాగుణంతో స్వీకరించి అవకాశం యివ్వలేని సమాజం క్రూరమైనది. పశ్చాత్తాపిని తిరిగి గతంతో బాధించే సమాజంలో పశ్చాత్తాపడ్డమే తప్పు అని తిరిగి పాతపద్ధతికే మళ్ళడాన్ని అనివార్యం చేస్తుంది. కొత్త జన్మలు ఎక్కడో లేవు. క్షమాగుణం - పశ్చాత్తాపమే తిరిగి కొత్త జన్మలనిస్తాయి. తెల్సీ తెలియకుండా గడిచిపోయిన జీవితాల్నించి తిరిగి కొత్త జీవితాల్ని ప్రారంభించే అవకాశం ఉంటే ఈ మనుషులు- ఈ సమాజం- ఈ మానవ సంబంధాలు మరింత ఉన్నతంగా ఎదుగుతాయి. సారవ్వ శారద సుశీలలు తిరిగి కొత్త జీవితాల్ని ప్రారంభించుకునేందుకు సమాజం సహకరించగలిగితే గతంలోని అనుభవాల్తో వారి "కొత్త జన్మ"లు ఎంత ఉన్నతంగా ఉంటాయో. వారికా కొత్త జీవితం యివ్వడానికి పురుషులు ఎంతమంది ముందుకు రాగలరు? ఆదర్శాల కబుర్లు చెప్పడం అందరికీ తేలికే. ఆచరించే తనవంతు వచ్చేసరికి అవి రోల్డుగోల్డు వ్యక్తిత్వాలని తేలిపోతాయి. తిని తీరిగ్గా కూర్చుని కబుర్లాడుకునే జీవితం ఆ ముగ్గురికి కొత్తే. అది వారికి జైలులా లేదు స్వర్గంలా ఉంది. వారికదొక భువన విజయంలా ఉంది. వంట తంట, పొట్ట కూటికోసం పొద్దున లేస్తేనే పోరాటం చేసే జీవితాల్నించి విముక్తి పొందిన ఆ జైలు జీవితం వారి వ్యక్తిత్వాల్లో ఎన్ని మార్పులు తెచ్చిందో ఎవరికి చెప్పతరం! ఆ జైల్లో వారి మధ్య ఒక మహోన్నత నూతన సమాజం పురివిప్పుకుంటోంది.

ఆశయ్యకు కలుగుతున్న కొత్త అనుభవాలు మరో తీరువి. సారవ్వా శారదా సుశీలా ఆ ముగ్గురు జీవితాల్ని తిరిగి గెల్చుకోవాల్సినవారైతే - ఆశయ్య తాను గెలుచుకున్న జీవితం పట్ల కూడా నిస్పృహ చెందేవాడు. అంబేద్కర్ సంఘాల నిర్మాణంతో పాటు పౌరహక్కుల సంఘాల్తో కల్సి ఊళ్ళు తిరుగుతున్న కొద్దీ ఆవేదనతో ఆశయ్య కడుపుకోతకు గురయ్యేవాడు. తనది కాని జీవితమేదో తాను జీవిస్తున్నట్టు గానే తన చుట్టూ ఉన్నవాళ్ళు తమది కాని జీవితమేదో జీవిస్తున్నారనిపించేది. జనం కొత్త జీవితాల్ని కోరుకుంటున్నారు. అందుకు అవకాశం యివ్వకుండా సమాజాన్ని శాసిస్తున్న శక్తులేవి? వ్యక్తుల స్వార్థమా - కులమా - ఆర్థికమా - మార్పునిచ్చగించని సంస్కృతా - అలవాటైన జీవితాలా - ప్రభుత్వ రాజ్యయంత్రాంగమా - పాలకవర్గాలా - ఇవన్నీనా - ఏదో గజిబిజి. ఛ.

బాల్యం ఎంత హాయి. ఊహ తెల్సీ తెలియని జీవితం ఎంత గొప్ప ఉత్తేజం. ఆలోచన అనుభవం పెరిగిన కొద్దీ ఆనందం ఆవిరైపోతుందా! ఎరుక సంతోషపడనీయదు. అది అహమై పీడని నీడవుతుంది. గోరంత జ్ఞానం కొండంత ఆశల్ని పెంచుతుంది. ఆశే నిరాశై నిస్పృహకు గురిచేస్తుంది. ఇక ఆశించడానికేమీ లేని నిరాశ జీవితం మీద కొండంత బరువై బతుకును భారం చేస్తుంది. అది యవనోత్తేజాన్ని ముసలిముదివగ్గులా కుదించేస్తుంది. సారవ్వవంటి దళితులకు స్త్రీలకు కర్మసిద్ధాంతం ఆశలేని నిరాశనిచ్చింది. అగ్రకులాలకు ఆశాపూరిత నిరాశనిచ్చింది. ఆశయ్య ఈ రెండో కోవలోకి వచ్చిపడ్డాడు. జైల్లోని సారవ్వ సుశీల గత జీవితం - ఆశలేని నిరాశ. అందులో జీవిత వృక్షం ఎండిపోయి సారవంతమైన మట్టి సానుభూతి కరుణ క్షమ కరువై ఎండి పగిలి నెర్రెలిచ్చి ఇసుకపర్రగా మారిపోయింది.

నిరాశ నిండు గర్భిణివంటిది. అనుభవించడం రావాలే గానీ నిరాశలో గర్భిణి స్త్రీలా ఆనందాన్ని పొందవచ్చు. అది జీవితాన్ని కొత్తగా ప్రసవిస్తుంది. కొత్త ఆనందాన్నిస్తుంది. ఆశ ఒక ఊహ. ఆశ అందమైనది. నిరాశ ఒక వాస్తవం. నిరాశ - వాస్తవం నుండి ఊహకు చేరుకొని దాన్ని వాస్తవం చేసుకోలేకపోయిన తీరును తెలుపుతుంది. ఆశ గమనాన్ని తెలుపుతుంది. నిరాశ గమ్యం యొక్క దూరాన్ని తెలుపుతుంది. ఆశ లక్ష్యాన్ని తెలుపుతుంది. నిరాశ ఆ లక్ష్యాన్ని చేరుకోలేని దశను తెలుపుతుంది. నిరాశ దాటిన లక్ష్యాల గమ్యాలపట్ల అహాన్ని తొలగిస్తుంది. మరింత ఉన్నత జీవిత

లక్ష్యాన్ని తిరిగి కొత్తగా ప్రారంభిస్తుంది. ఆ ముగ్గురి మధ్య యిలా ఎన్ని చర్చలో..... జైలు ప్రపంచంలో ప్రపంచానికి వెలుగునిచ్చే ఎన్నో పుస్తకాలు రాయబడ్డాయంటే రాయబడవూ మరీ! తన మనస్సు - ఈ సమాజ లోపలి పొరల్లోకి వెళ్ళి తరచి చూసే సమయమూ ఏకాగ్రతా స్వేచ్ఛా చిక్కేది జైల్లోనే కదా! అని కూడా చర్చించుకున్నారు. బయటి ప్రపంచం చూసి ఆశయ్య ఏం ఆలోచిస్తున్నాడో తమ లోపలి ప్రపంచం చూసి వాళ్ళూ అదే ఆలోచిస్తున్నారని అతనికి తెలియదు. అలాగే హాయిగా స్వేచ్ఛగా యింకా కొంతకాలం బతకాలి - యింకా చదువుకోవాలి అనే సారవ్వ నిశ్చయాన్ని కోర్టు నిరాశ చేసింది. సాక్ష్యాలు లేక కోర్టు కేసుకొట్టేయడంతో జైలునుండి వీధిలో పడింది. తనకు తెలియని వారెవరో తన పార్టీ తరఫున స్యూరిటీస్ యివ్వడంతో కొన్నాళ్ళకు శారద బేల్‌పై బయటకు వచ్చి పార్టీలో భాగంగా జనారణ్యంలో తిరిగి కలిసిపోయింది. ఒంటరి సుశీల తండ్రి యిస్తానన్న స్యూరిటీస్‌ను వద్దంటున్న సుశీల అపుడు అంగీకరించి యింటికి చేరింది.

జైల్లో ఉన్నప్పుడు బయటకు వచ్చాక ముగ్గురం కల్సి ఉందాం. ఒకే దళంగా పని చేద్దాం. అక్కడా మగవాళ్ళ పెత్తనం ఎదురైతే మహిళా సంగాలు పెడ్దాం. నాటి బౌద్ధభిక్షువుల్లా నేడు కొత్త ఒరవడి సృష్టిస్తూ స్త్రీ బౌద్ధభిక్షువుల్లా సమాజానికి అంకితం అవుదాం అని జైల్లో చేసుకున్న బాసలు బయటకు వచ్చాక నిలవలేదు. సారవ్వా సుశీలా ఏదో ఉత్తేజంలో సరేనన్నారు గానీ బయటకు వచ్చాక ఎవరి జీవితం వారిదైపోయింది. ముందు నేను కబురు చేస్తాను. ఆ తర్వాత వీలు చేసుకొని నేనే వస్తాను నాతో రావడానికి రడీ ఉండండి అని శారద అన్నప్పుడు జైల్లో నిర్బంధంలో సై అన్నారు గానీ బతుకుమీది తీపి అంత త్వరగా వదిలేది కాదని బయటకు వచ్చాక వారికి అర్థం కావడానికి ఎంతో కాలం పట్టలేదు.

బావిలో పడి చావాలనుకున్న సారవ్వ యిపుడు చాలా మారిపోయింది. నిర్బంధంలో శారద యిచ్చిన చైతన్యం సారవ్వను దళంలో చేరి మళ్ళీ చావడానికి సిద్ధం చేసింది. ఆనాడు ఊరకే చావడం కన్నా ఈ రోజు ఒకమంచి సమాజం కోసం చావడానికి సిద్ధపడ్డం ఎంతో నయం. అయితే యిపుడు ఆమెకు శారద చెప్పిన త్యాగం పట్ల భిన్నాభిప్రాయం లేదు. అసలు ఎందుకు చావాలి అనే అంశంతోనే విభేదించింది. ఆశ - నిరాశ - లక్ష్యం - గమ్యం - మరింత ఉన్నత లక్ష్యాల చర్చ ఆమెను చావును ప్రేమించే దశనుండి బతుకు ప్రేమించే దశకు పరివర్తన చెందించింది. జీవితాన్ని ఓడిపోయినవారు నిరసనతో, త్యాగంతో చావుకు సిద్ధపడ్డా - జీవితాన్ని తిరిగి గెలుచుకునే అవకాశాలున్నాయనే కొత్త ఆశలు లక్ష్యాలు కొత్తగా చిగురిస్తే - చావుకు సిద్ధపడి బతుకును ప్రేమించడం నుండి - బతుకుకు సిద్ధపడి చావును నిరాశ నిర్లక్ష్యం అనే రూపంలో ప్రేమించడంలోకి పర్యవసిస్తారా - ప్రాణాలివ్వడం కోసం వచ్చి కొంతకాలం పని చేసి తిరిగి వెనక్కి వెళ్తున్నవాళ్ళు - ఈ దశలోని వారేనా - అలా అయితే ఈ నిర్బంధాలు తొలగిపోతే చావు భయంతో చేరి చావుకు సిద్ధపడి పనిచేస్తున్న రిక్రూట్‌మెంట్ అంతా దళాల్లోంచి రిట్రీట్ అవుతారా! నిర్బంధం ఉంటే తప్ప తమ రిక్రూట్‌మెంటు సాగదా! సారవ్వ సుశీలల్తో ఓ రౌండు చర్చించి వెళ్ళాక శారదలో ఈ కొత్త అనుమానాలు మొదలయ్యాయి. భయం భయంగానే తన భయాల్ని పార్టీ ముందుంచితే తేలిగ్గా నవ్వేసి నీక్కూడా వెళ్ళిపోయి వారిలాగే జీవించాలనిపిస్తోందని చెప్పరాదూ - అని హేళన చేయడంతో తన కమిట్‌మెంటు పట్ల ఆ మాటలు శూలాల్లా గుచ్చినట్టయి విలవిలలాడిపోయింది. కొన్ని భావాల్ని వ్యక్తం చేయకపోతేనే హాయి. ఎక్కువ గౌరవం. ఆ కోవలో ఈ చర్చనీ చేర్చేసి మౌనం దాల్చింది శారద. కాని సారవ్వ వాదనలో ఏదో సత్యం తాలూకు అంశ ఉందనిపించేది.

అత్తగారి ఊరూ, చెల్లెలింటికీ - మాలతి - సుశీల - ఆశయ్యల యిళ్ళమధ్య ఆసు పోస్తున్నట్టుగా తిరుగుతూ సారవ్వ పరిపరివిధాల భావి జీవితం గూర్చి ఆలోచిస్తోంది. అసలు పెళ్ళీ పిల్లలూ లేకుండా ఆ ఆశనిరాశల్తో పనిలేకుండా సమాజం కోసం బ్రహ్మచారుల్లా - సన్యాసుల్లా - బౌద్ధ భిక్షువుల్లా

స్త్రీలు తమ బతుకు తాము ఎందుకు బతకకూడదు. స్త్రీలు బౌద్ధ భిక్షువుల్లా మారితే మానవవంశం నిర్వంశం అవుతుందనే బావవాదనలో మగదృష్టి తాలూకు లోపం లేదా! స్త్రీలు ఎందుకు పిల్లల్ని కనాలి. ఎందుకు మగవాళ్ళను సుఖ పెట్టాలి. ఇపుడు సమాజంలో రావాల్సింది అంబేద్కర్ చెప్పిన నవబౌద్ధ విప్లవం. ఈ మాటపై మాలతితో పాటు ఆశయ్య కూడా సారవ్వతో ఏకీభవిస్తాడు. అయితే ఆ బౌద్ధ విప్లవం యిపుడు స్త్రీవాద కోణంలో భాగంగా స్త్రీబౌద్ధ భిక్షు సంఘాల ద్వారానే సాధ్యం అని చేసే మాలతి సారవ్వల చర్చల్లో ఆశయ్య విభేదిస్తాడు. నువ్వు ఆడదానివై పుట్టి ఉంటే నీకు తెల్సి ఉండేది అనడంతో ఆశయ్య ఓడిపోయినట్టు నవ్వి తలవేలాడేస్తాడు. దాంతో ఆశయ్య స్థానంలో సుశీలను కలుపుకున్నారు వారు. ఏదో మిషతో ఆ ముగ్గురు కల్సుకొని ఏదేదో చర్చించేవారు. ఆ ప్రశ్నలు అపుడపుడు ఆశయ్యను కూడా చర్చకు లాగేవి.

ఇంతకూ తాము ఎందుకోసం బతకాలి. మాలతి కూతుర్ని చూసుకుంటూ బతుకుతుంది. తమ యిద్దరికీ ఇపుడా అవకాశం లేదు. అసలు ఈ జీవితం అంటే ఏమిటి? తమకు తెల్సింది జీవితమేనా - స్త్రీల సగటు జీవితాలు యిలానే ఉంటాయా - తాము జైల్లో ఒక కొత్త జీవితాన్ని ఒక కొత్త సమాజాన్ని సృష్టించుకున్నారు. ఈ సమాజంలో ఆ నమూనా జీవితాన్ని తిరిగి కొత్తగా ప్రారంభించగలిగితే ఎంత బాగుండు.

"అందుకు ఈ పాత తెల్సిన సమాజాన్ని వదిలేసి మనం తెలియని ఒక కొత్త సమాజంలోకి వేరొకచోట కొత్తగా ప్రవేశించాలి. నాలాంటి ఉద్యోగులకు అది ఎలా సాధ్యం. ఈ సర్వీసు సీనియారిటీ పోతుంది. కొత్త చోట ఆర్థిక అభద్రత ఎంతో కుంగ దీస్తుంది. ఇంత జీతం కొత్త చోట సంపాదించడం అసాధ్యమైన విషయం". అది మీలాంటి భద్ర జీవితంలేని వారికే ఉన్న గొప్ప అవకాశం" అంది మాలతి.

"అసలు ఒక కొత్త సమాజంలోకి నేనెందుకు వెళ్ళాలి. శారద చెప్పిందీ యిదే గదా - పార్టీ అనే కొత్త సమాజంలోకి వెళ్ళి పాత సమాజాన్ని ఒక కొత్త సమాజంగా మార్చడం గురించే శారద చెప్పింది. నేను ఆ మాటనే గదా వ్యతిరేకిస్తున్నది. నేను కొత్త సమాజంలోకి ఎందుకు వెళ్ళాలి. ఈ పాత సమాజంలో కొత్త జీవితాన్ని సాధించుకుంటూ ఈ సమాజాన్నే కొత్త సమాజంగా ఎందుకు మార్చకూడదు. ఈ సమాజం అలా ఎందుకు మారకూడదు? వెనకా ముందూ ఎవరూ లేని స్త్రీని మనం ప్రవేశించే కొత్త సమాజం ఎలా స్వీకరిస్తుందో" అంది సారవ్వ.

"బాల్యం నుండి మన జీవితాల్ని మళ్ళీ కొత్తగా ప్రారంభిస్తే ఎంత బావుండేదో" అంటూ వేదాంతంలో పడ్డాడు ఆశయ్య.

"అపుడు సారవ్వను చేసుకొనేవాడివా - మాలతిని చేసుకొనేవాడివా?" సూటిగా ప్రశ్నించింది సుశీల. ఆశయ్య అయోమయం అయిపోయాడు. గడిచిపోయిన కష్టాలు జ్ఞాపకాల్లో అందంగానే ఉంటాయి. అవే కష్టాలు మళ్ళీ ఎదురైతే - ఆ బాల్యం నాకొద్దు ఆ కష్టాలు నాకొద్దు అనేవాళ్ళే ఎక్కువ. ఆశయ్యను చూసి సారవ్వ ఆశగా నవ్వింది. అటు సారవ్వ - ఇటు మాలతి - మరోవైపు లక్ష్మి - ఎటూ తేల్చుకోలేక అవస్థపడుతున్న ఆశయ్యను చూసి భలే నవ్వింది. నవ్వి నవ్వి విషాదంగా "తిరిగి బాల్యం నుండి ప్రారంభించినా మన జీవితాలు యిలాగే ఉంటాయి" అంటూ గంభీరమైపోయింది మాలతి.

"ఏం అలా అంటావు?" అని ఆశ్చర్యపోయాడు ఆశయ్య. తాను ఎవర్ని చేసుకునేవాడో అనే చర్చ తప్పిపోయిందని లోలోన సంతోషపడ్డాడు. అది గమనిస్తూనే అంది మాలతి.

"ఈ సమాజం మారలేదు గనక - మనం - అవే మన పాత్రల్ని పోషించక తప్పదు. మనం ఉన్న ఆ సామాజిక స్థితిగతుల్లో మనలో ఎవరం కూడా అంతకన్నా భిన్నంగా ప్రవర్తించడం సాధ్యం కాదు. ఉదాహరణకు సారవ్వను నువు చేసుకొని ఉంటే సంసార జంజాటంలో నీ చదువు ఆగిపోయేది.

పోనీ నేను నీతో లేచిపోయి వచ్చినా నీ చదువాగిపోయేది. తెచ్చినకాడికి నా నగలు అయిపోయినంక - నువ్వు చేయవట్టే యిన్ని కష్టాలు అని తిట్టికొట్టి పోసేవాడివి - ఏవేవో చిన్న వృత్తులు చేస్తూ."

ఆ రోజు మాలతి కోసం వచ్చిన సారవ్వ అక్కడ బావను చూసి రాకూడనివేళ వచ్చాననుకొని చటుక్కున వెనుదిరిగింది. "ఛ - నీకింకా ఆ అనుమానం పోలేదా అంటూ మాలతి సారవ్వను రెక్కపట్టుకుని లాక్కొచ్చి కూర్చోపెట్టింది. మాలతి చాకచక్యం వల్ల కొద్ది సేపట్లోనే తిరిగి ముగ్గురూ ఒక్క హృదయంలా మారిపోయారు. పాత జ్ఞాపకాల మీద జోకులు వేసుకున్నారు. ఆలస్యంగా వచ్చిన సుశీల వారితో జతపడింది.

"నువ్వు ఎన్ని చెప్పు. బావను నీకు నేను త్యాగం చేయలేదంటావా!" అని నవ్వుతూ సీరియస్‌గానే మాలతిని నిలదీసింది సారవ్వ.

మాలతి కోసం బావ కోసం తన జీవితాన్ని త్యాగం చేశాననే భావనే సారవ్వను సజీవంగా ఆశాజీవిగా ఉంచుతోంది. అది వాస్తవం కాదని తెలిస్తే ఆమె ఆశా విశ్వాస సౌధాలు కుప్పకూలిపోతాయని మాలతి గ్రహించలేకపోయింది.

"నీ కులం-ఆర్థికస్థితి నిన్ను చదువుకోనీయలేదు. నా కులం నన్ను ఆశయ్యతో లేచిపో నీయలేదు. అతని చదువే నిన్నూ నన్నూ - అతన్ని దగ్గర చేసింది. దూరమూ చేసింది. మీ బావ చదువుకొని యింతగా ఎదగకపోయి వుంటే నీవింతగా ప్రేమించేదానివీ కాదు. ప్రేమించినా వెంకటయ్యను మరిచినట్టే మరిచిపోయి ఉండేదానివి. నేనూ అంతే. అతని చదువు ఉద్యోగం మన యిద్దరి ప్రేమల్ని పెంచి మన పీకలమీదికి తెచ్చింది. నీవు పుట్టిన కులం కారణంగానే నీవు నీ బావను త్యాగం చేయాల్సి వచ్చింది. ఇదొక సామాజిక అనివార్యత. ఇందులో నీ త్యాగం పాలు చాలా తక్కువ. నీవు లేకపోతే మరొకరి సాయంతోనైనా మీ బావను నేను వాటేసుకునే దాన్నే గదా - ఆలోచించు."

ఆ వివరణతో సారవ్వ దిగాలుపడిపోయింది. అకస్మాత్తుగా నిస్పృహతో తూలిపడి పోయింది. సుశీల మాలతి కల్సి ఆమెను మంచం పైకి చేర్చారు. బావకోసం మాలతి కోసం తన జీవితాన్ని త్యాగం చేశాననే భావన ఒక్కసారిగా వేళ్ళు నరికిన చెట్టులా కూలిపోవడంతో సారవ్వ తట్టుకోలేకపోయింది. అది వాస్తవం అయినా కాకపోయినా ఆ భావనే ఆమెకు మళ్ళీ జీవితేచ్ఛనిస్తోందని మాలతికి అపుడు గానీ అర్థం కాలేదు. కొత్త ప్రాణం పోసి శారద ఎక్కించిన త్యాగం భావన యిలా దిగిపోవడం చూసి సుశీల చకితురాలైంది.

వాస్తవాలకన్నా విశ్వాసాలు బలమైనవి. పైకి మొండిఘటంలా కన్పించే సారవ్వ హృదయం యింత సున్నితమైందా అని తొలిసారిగా చకితుడయ్యాడు ఆశయ్య. జీవిత సర్వస్వం కోల్పోయినా ఆమె ఆత్మాభిమానమే ఆమెను బతికిస్తోంది. మాలతి కూల్చింది ఆ ఆత్మాభిమానాన్నే. స్పృహ కొచ్చాక కడుపునొప్పితో గిలగిలా కొట్టుకుంది.

వారం రోజులకు కోలుకున్నప్పటికీ మునుపటిలా నవ్వలేకపోయింది సారవ్వ. మాలతి కళ్ళల్లోకి సూటిగా చూడలేకపోయింది. గర్భసంచిలో ఏవో మార్పులు చోటు చేసుకొంటున్నాయని డాక్టరు మేడం చెప్పిన విషయం సారవ్వకు చెప్పకుండా దాటేసింది మాలతి. అది క్యాన్సర్‌గా మారవచ్చునన్న ఆమె మాటకు తనలో తనే బాధపడ్తోంది మాలతి. సారవ్వకే వివరాలు తెలియకపోయినా జైల్లో ప్రారంభమైన తన తెల్లబట్ట - కడుపునొప్పి రోజురోజుకూ పెరుగుతున్నట్టు మాత్రం గ్రహించింది. సారవ్వ పాత ఆదర్శాల్తో పాటు పాత ప్రణాళికలు సుడిగాలికి లేచిన ఎండుటాకుల్లా కొట్టుకుపోయాయి. ఎటూ పాలుపోక గమ్యం లేని నౌక అక్కడే లంగరు పడింది. నెలరోజుల్లో మాలతి పనిమనిషిలా చూడకపోయినా సారవ్వకు ఆ యింట్లో స్థిరపడిన స్థానం అదే. టేలర్ పని నేర్చుకోవడం పూర్తయ్యేదాకా ఓపికపట్టి - చివరకు తన చెల్లెలి మొగుడే సర్పంచ్‌గా ఉన్నాడన్న ధీమాతో పోలీసుల భయాన్ని పారదోలి

- తాను పుట్టి పెరిగిన ఊరికే పయనమైంది సారవ్వ.

టేలర్ పని చేసుకుంటూ తమ వాడ పిల్లల్తో ఆడుతూ పాడుతూ గతాన్ని మరిచి పోతున్నంతలో అంగన్‌వాడి టీచర్‌గా ఎన్నికై సారవ్వకు ఒక స్థిరజీవితాధారం దొరికినట్టయింది. టేలర్ పని కూడా కొనసాగిస్తూ పిల్లల్తో తన ఆనందాన్ని కల్సి పంచుకుంటోంది.

తల్లిని కోల్పోయిన ముగ్గురు పిల్లలకు తల్లిగా - వేసక్టమీ చేయించుకున్న అతనికి భార్యగా ఓ పెళ్ళి సంబంధం వచ్చిందని ఎటూ తేల్చుకోలేకుండా ఉన్నాను - రమ్మని రాయడంతో సుశీల యింటికి వెళ్ళింది సారవ్వ. సారవ్వ వెళ్ళిన మరుసటి రోజే శారద హఠాత్తుగా అక్కడ ఊడిపడింది. ముగ్గురు నెచ్చెలులు కల్సుకున్న సంతోషంతో సుశీల బంధువుల యింట్లో (శారద టెక్ జాగ్రత్తల కోసం ఎన్నుకున్న స్థలం అది) మూడు రోజులు హాయిగా గడిచిపోయాయి. ఏదో ట్రీట్‌మెంటుకోసం వస్తూ అక్కడికి వచ్చానని చెప్పింది శారద. శారద మొహం నిండు ముత్తయిదు జవ్వనిలా కళకళలాడుతోంది. జైలులో కన్నా కొంచెం చిక్కిపోయినా ఒక నూతనోత్తేజంతో శరీరం పెటపెటలాడుతోంది.

★ ★ ★

"నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకున్నావా-" అని అడిగింది సారవ్వ. ఎలా పసిగట్టిందబ్బా అని ఆశ్చర్యపోయింది శారద. నవ్వుతూ ఔనన్నట్టు తలవూపింది. "మస్తు మంచోడనుకుంట. చెప్పినట్టు వినే మొగుడు దొరికితే అంతకన్నా కావల్సింది ఏముంది. బాగా చదువుకున్న సంస్కార వంతుడా" అని అభినందించింది సుశీల.

"చదువుకున్నోడు కాదక్కా. వాళ్ళది గోండు వంశం. గోండు రాజ్యం. పెద్దగా చదువుకోలేదు గానీ - నువ్వన్నట్టు చెప్పినట్టు వినే మొగుడే దొరికాడు. చక్కని హృదయం. అయితే ఆ హృదయానికి భాషరాదు.... అది సరేగాని నీక్కూడా ఒక మంచి మొగున్ని చూసిపెట్టా నక్కా. మరి ఎపుడు బయలుదేరుతున్నావు." అని గలగలా నవ్వింది శారద.

సారవ్వ సుశీల కొద్ది క్షణాలు మాట్లాడలేదు. దాంతో శారద మాటమార్చి ఏవో కబుర్లకు దిగింది. కాసేపాగి సారవ్వ వైపు చూస్తూ నాతో రావడానికి నీకేం తక్కువైంది. ఇక్కడ నీకింకేం మిగిలింది. పార్టీ కూడా నీకు జరిగిన అన్యాయానికి చాలా బాధపడ్తోంది - నేను చెప్పాక" అంది శారద.

"శారదా-నీలా నాది కాలేజీ సదువు చదువుకోగలిగిన జీవితం కాదని నీకు తెలియదా! ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలంటారు పెద్దలు. నేను పుట్టి పెరిగిన పల్లెలో కులంలో నా జీవితాన్ని పోగొట్టుకున్నాను. అక్కన్నే నా జీవితాన్ని గెలుచుకుంటాను." అంది సారవ్వ.

"ఏదోలా నీవు మీ ఊరి మదర్ తెరిసా ననిపించుకుంటానంటావు"

"అంత పెద్దవాళ్ళతో పోలికెందుకు గానీ - మాలతి ఒక మాట చెప్పింది. మా ఊరి సర్పంచ్‌ను స్త్రీలకు రిజర్వు చేస్తున్నారు. నీవెందుకు ప్రజల హృదయాలను గెల్చుకోకూడదు అని అడిగింది. ఆ విషయమే ఆలోచిస్తున్నాను."

"ప్రజల హృదయాలను గెలిచి పదవి సాధించగలవేమో గాని కొత్త భర్తను సాధించు కోగలవా."

"నాకా విషయంపై మనసు రోసిపోయింది. ఏదో కాస్త ఉన్న భ్రమల్ని మాలతి వాస్తవాలు చెప్పి పటాపంచలు చేసింది. ఇపుడు నేను బాగానే బతుకుతున్నాను. గతం మరిచి నన్నూ నా కొత్త జీవితాన్ని నా చుట్టూ వాళ్ళు గౌరవిస్తున్నారు. నాకు అడవుల్తో ఇతర ఊర్లతో పనిలేదు. ఎందుకంటే నేనెక్కడ పోగొట్టుకున్నానో అక్కడే నా జీవితాన్ని గెలుచుకుంటున్నాను. నీవు కోల్పోయిన జీవితం అంటూ నీకేమీ లేదు - ఉంటే నీవూ నాలాగే అదే బంధుమిత్రుల మధ్య అదే ఊర్లో అదే సమాజంలో

తిరిగి గెలుచుకో. నాకు యింతకన్నా గొప్ప విప్లవమూ జీవితమూ కనపడ్డంలేదు. నీ దయవల్ల నేనిపుడు పిరికిదాన్ని కానని నీకు తెల్సు."

తనకన్నా వయసులో ఎంతో పెద్దయిన సారవ్వతో మరింత వాదన పెట్టుకోలేక పోయింది శారద. ఆమె పడిన కష్టాలు కన్నీళ్ళు తనకు తెల్సు. ఆమె నిర్ణయంలో ఏదో సత్యం అంశ ఉండే వుంటుంది. అది ఆమె పట్ల తనకున్న విశ్వాస గౌరవం.

అలా మాట్లాడుతూనే ఉన్నారు. అకస్మాత్తుగా (గర్భసంచి) కడుపునొప్పితో మెలి తిరిగిపోయింది సారవ్వ. సుశీల డాక్టరుకు చూపించి వారం గడిచాక మాలతి యింట దింపి వెళ్ళింది. శారద నాలుగో రోజే వెళ్ళిపోయింది.

ఆశయ్య సారవ్వ స్థితి చూసి కన్నీళ్ళు పెట్టాడు. ఆశయ్య భార్య లక్ష్మి తమ యింటికి రమ్మంది. "ఈ అభిమానం యిలాగే ఉండనీ" అని లోతుకుపోయిన కళ్ళతో నీరసంగా నవ్వింది సారవ్వ. "మీ బావను తీసుకొని లేచిపో అక్కా-నేను ఏమనుకోను" అని లక్ష్మి నవ్వించే ప్రయత్నం చేసింది. "నిజంగానే మనం లేచిపోదామా సారవ్వా" అని నవ్వుతాలకే అనబోయినా ఆశయ్య కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

ఆ మాటకు మాలతి అభ్యంతరం పెట్టింది. "మొగుడు-మగతోడు లేకపోయినా ఎంత హాయిగా ఆనందంగా - సొంత వ్యక్తిత్వంతో - సొంత కాళ్ళపై నిలబడి బతకగలమో - మా జీవితాల్ని మేం ఎలా గెలుచుకోగలమో - నిరూపించాక - ఇపుడు నీ అవసరం ఎవరికో ఉన్నట్టు - మగతోడు లేకపోతే ఆడవాళ్ళు బతకలేరన్నట్టు - ఇపుడు లేచిపోదామా అంటావేమిటి? మళ్ళీ మీ మగపెత్తనం మా మీద రుద్దటానికా" అని నవ్వింది మాలతి.

"ఎంత చక్కగా జవాబు చెప్పావు" అన్నట్టు మాలతికేసి చూస్తూ కళ్ళతోనే అభినందించింది సారవ్వ. అంతలో అకస్మాత్తుగా మళ్ళీ తెరలు తెరలుగా లేచిన గర్భసంచి కడుపు నొప్పితో స్పృహ కోల్పోయింది సారవ్వ. స్పృహలోకొచ్చాక "ఒక్కసారి యిలా రా బావా" అని చేత్తో నీరసంగా దగ్గరకు తీసుకుని మనసారా ముద్దిడుకుని ఆనంద భాష్పాలు రాల్చింది.

"మీరంతా తోడుండగా - ఇంకేం కావాలి. నా జీవితానికిది చాలు" అని అందరికీ నమస్కరించింది సారవ్వ.

★ ★ ★

కొన్నాళ్ళకు కష్టాల "గర్భసంచి" తొలగించబడ్డ సారవ్వ మసిగుడ్డ జీవితం పసిగుడ్డు జీవితంలా మళ్ళీ కొత్తగా వికసించడం ప్రారంభమైంది. కాలక్రమంలో ఆమె జీవితంలాగే ఆమె పేరు ఇంటిపేరు కొంచెం మార్పు చెందింది. ఆ ఊళ్ళో ఇపుడామెను అందరు "సర్‌పంచ్ సారక్క" అని ప్రేమగా పిలుచుకుంటారు.

★ ★ ★

రమేశ్‌గారూ! ఇందులో చెప్పిన ఆశయ్యను నేనే. మీరు సారవ్వను పెళ్ళి చేసికొంటే అది ఎందరికో ఆదర్శం అవుతుంది. మీ పిల్లల్ని సారవ్వ తన సొంత పిల్లల్లా చూసుకోగలదు. మాలతిని చేసికొంటే మీ స్థాయి జీవితంలో వెంటనే కలగల్సిపోతుంది. సుశీలను చేసుకొంటే మగవాళ్ళంతా చెడ్డవాళ్ళు కారు అని అర్థం చేయించినట్టవుతుంది. ఒకటి చెప్పగలను. ఇన్ని అనుభవాలెదురైనా వాళ్ళ హృదయాలు తెల్లబట్టలా నిర్మలమైనవి. వీళ్ళలో ఎవర్ని చేసికొన్నా మీ జీవితంతో పాటు ఆమె జీవితాన్ని కూడా చిగురింపజేసినవారవుతారు. మీ నిర్ణయం కోసం వాళ్ళూ నేనూ ఎదిరి చూస్తుంటాం. ఉంటాను.

— మీ విద్యాధరరావు.

అక్టోబర్ 1997

ఆంధ్రజ్యోతి వారపత్రిక (నాలుగు సంచికల్లో)